సాక్షి
వికారాబాద్

శుక్రవారం । 30 । మే । 2025



పంట మార్పిడితో మేలు
ఒకే రకమైన పంటల సాగుతో భూసారం క్రమంగా తగ్గుతుందని వ్యవసాయ శాస్త్రవేత్తలు హెచ్చరిస్తున్నారు. 8లో▸



భౌభౌలతో బెంబేలు
దుద్యాల్ మండలంలో వీధికుక్కల సమస్య రోజురోజుకూ తీవ్రమవుతోంది. వీధుల్లో నడవాలంటేనే జనం జంకుతున్నారు. 8లో▸



ఎన్నాళ్లీ ఎదురుచూపు!
రేషన్ కార్డుల్లో మార్పులు, చేర్పులు చేయకపోవడంతో లబ్ధిదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. 9లో▸

న్యూస్‌రీల్

రేపు జాబ్‌మేళా
అనంతగిరి: వికారాబాద్ పట్టణంలో ఈ నెల 31న అపోలో ఫార్మసీలో ఉద్యోగాల భర్తీ కోసం జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధి అధికారి సుభాన్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10.30గంటలకు పట్టణంలోని ఐటీఐ కళాశాల ఆవరణలో జాబ్‌మేళా ఉంటుందని తెలిపారు. అర్హత కలిగిన అభ్యర్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. మరిన్ని వివరాలకు సెల్ నంబర్ 96760 47444లో సంప్రదించాలని తెలిపారు.

నకిలీ విత్తనాలు విక్రయిస్తే కఠిన చర్యలు



ఎరువుల దుకాణంలో స్టాక్ వివరాలు పరిశీలిస్తున్న లక్ష్మి

మోమిన్‌పేట: నకిలీ విత్తనాలు విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని జిల్లా స్క్వాడ్ అధికారి లక్ష్మి హెచ్చరించారు. గురువారం మండల కేంద్రంలోని విత్తనాలు, ఎరువుల దుకాణాలను ఆకస్మికంగా తనిఖీలు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రతి దుకాణంలో స్టాక్, ధరల వివరాలు, ఏయే కంపెనీ విత్తనాలు, ఎరువులు ఉన్నాయో బోర్డుపై ఉంచాలన్నారు. ప్రభుత్వం నిర్ణయించిన ధరలకే ఎరువులు, విత్తనాలు అమ్మాలని లేకుంటే లైసెన్సులను రద్దు చేస్తామన్నారు. విత్తనాలు, ఎరువులు కొనే వారికి విధిగా బిల్లులు ఇవ్వాలని డీలర్లకు సూచించారు. రైతులు కూడా బిల్లులు, విత్తన ప్యాకెట్లను పంట కాలం పూర్తయ్యే వరకు జాగ్రత్తగా ఉంచుకోవాలన్నారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి జయశంకర్ తదితరులు పాల్గొన్నారు.

సబ్సిడీలను సద్వినియోగం చేసుకోవాలి
- ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి
- రైతులకు పచ్చిరొట్ట విత్తనాల పంపిణీ



రైతులకు సబ్సిడీ విత్తనాలు అందజేస్తున్న ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి

పూడూరు: రైతుల సంక్షేమం కోసం ప్రభుత్వం ఇస్తున్న సబ్సిడీలను సద్వినియోగం చేసుకొని ఆర్థికంగా ఎదగాలని పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి అన్నారు. గురువారం మండల పరిధిలోని మన్నెగూడ ఆగ్రోస్ కేంద్రంలో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో 50 శాతం సబ్సిడీతో పచ్చిరొట్ట విత్తనాలను రైతులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతులకు అవసరమైన నాణ్యమైన విత్తనాలను సబ్సిడీపై సరఫరా చేస్తున్నట్లు తెలిపారు. పట్టాదారు పాసుపుస్తకం, ఆధార్ కార్డు జిరాక్స్‌తో రైతు సేవా కేంద్రాల్లో సబ్సిడీ విత్తనాలు పొందాలని సూచించారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ పట్లోళ్ల సతీష్‌రెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు సురేందర్, డీసీసీ ఉపాధ్యక్షుడు రఘునాథ్‌రెడ్డి, డీసీసీ కార్యదర్శులు పెంటయ్య, షకీల్, అజీం పటేల్, నాయకులు శ్యాంసుందర్‌రెడ్డి, అబ్బాస్ ఖాన్, కృష్ణ, లక్ష్మణ్, బాలమణి, తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఇంటికీ సీసీ కెమెరా ఉండాలి
ఎస్పీ నారాయణరెడ్డి



కేసుల వివరాలు తెలుసుకుంటున్న ఎస్పీ నారాయణరెడ్డి

బొంరాస్‌పేట: ప్రతి దుకాణానికి, ఇంటికి సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని ఎస్పీ నారాయణరెడ్డి సూచించారు. గురువారం స్థానిక పోలీసు స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. మండల పరిధిలోని కేసులు, రోడ్డు ప్రమాదాలపై ఆరా తీశారు. జాతీయ రహదారి 163పై ఉన్న గ్రామాల్లో తరచూ రోడ్డు ప్రమాదాలు, దొంగతనాలు జరుగుతున్నందున ప్రత్యేక నిఘా ఉంచాలని ఆదేశించారు. సీసీ కెమెరాలతో దొంగతనాలను అరికట్టవచ్చని తెలిపారు. ప్రస్తుతం వర్షాలు పడుతున్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో పరిగి డీఎస్పీ శ్రీనివాస్, సీఐ శ్రీధర్‌రెడ్డి, ఎస్ఐ రవూఫ్ సిబ్బంది పాల్గొన్నారు.

ఇవేం బదిలీలు..!

జిల్లాకు ఇటీవల ఐదుగురు తహసీల్దార్ల కేటాయింపు
- ఇందులో ఒకరు ఉద్యోగ విరమణ పొందిన వారు..
- సస్పెన్షన్‌కు గురైన మరో అధికారి
- మిగిలిన ముగ్గురికి మండలాలు కేటాయించని వైనం
- పరిష్కారం కాని రెవెన్యూ సమస్యలు
- ఇబ్బందుల్లో ప్రజలు



బషీరాబాద్ తహసీల్దార్ కార్యాలయం

బషీరాబాద్: తహసీల్దార్ల బదిలీల ప్రక్రియలో తప్పిదాలు చోటుచేసుకున్నాయి. పదిహేను రోజుల క్రితం రాష్ట్ర వ్యాప్తంగా 44 మంది తహసీల్దార్లను ప్రభుత్వం బదిలీ చేసింది. ఇందులో భాగంగా మన జిల్లా నుంచి ఐదుగురిని సంగారెడ్డి, నారాయణ పేట జిల్లాలకు బదిలీ చేసింది. వీరి స్థానంలో కొత్త వారిని జిల్లాకు కేటాయించారు. ఇంత వరకు బాగానే ఉన్నా వీరిలో ఒకరు ఉద్యోగ విరమణ పొందిన అధికారి అశోక్ ఉండటం ఆశ్చర్యం కలిగిస్తోంది. అంతేకాకుండా నల్లగొండ జిల్లాలో ఏసీబీకి చిక్కి సస్పెండ్ అయిన కిరణ్‌కుమార్ పేరు బదిలీ జాబితాలో ఉంది. మిగిలిన ముగ్గురు తహసీల్దార్లు షాహిదాబేగం, జే.బుచ్చయ్య, వెంకటస్వామిపది రోజుల క్రితం కలెక్టరేట్‌లో రిపోర్ట్ చేశారు. అయితే ఇప్పటి వరకు వారికి మండలాలు కేటాయించలేదు. ప్రస్తుతం బషీరాబాద్, నవాబుపేట, యాలాల మండలాల తహసీల్దార్ల పోస్టులు ఖాళీగా ఉన్నాయి. యాలాల తహసీల్దార్ అంజయ్య గత నెల 30న పదవీ విరమణ పొందారు. అప్పటి నుంచి ఆ పోస్టు ఖాళీగా ఉంది.

డీటీలకు అదనపు బాధ్యతలు

జిల్లాలో ఖాళీగా ఉన్న బషీరాబాద్, యాలాల, నవాబుపేట మండల తహసీల్దార్ పోస్టుల్లో టీడీలకు ఇన్‌చార్జ్ బాధ్యతలు అప్పగించారు. వారే భూముల రిజిస్ట్రేషన్, ఇతర ముఖ్య బాధ్యతుల నిర్వహిస్తున్నారు. వీరిపై అదనపు భారం పడటంతో రెవెన్యూ సమస్యలు సకాలంలో పరిష్కారం కావడంలేదు. దీంతో ఆయా మండలాల్లో తహసీల్దార్ కార్యాలయానికి వచ్చే రైతులు, ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు.

బషీరాబాద్, యాలాల ఆర్ఐలకు డిప్యూటేషన్

బషీరాబాద్, యాలాల మండలాల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లను ఉన్నతాధికారులు మంగళవారం డిప్యూటేషన్ వేశారు. ఇక్కడ పనిచేసిన నాగార్జునరెడ్డిని యాలాల ఆర్ఐగా,అక్కడి ఆర్ఐగా పనిచేసిన శివ చరణ్‌ను బషీరాబాద్‌కు డిప్యూటేషన్‌పై బదిలీ చేశారు.

ఇన్‌చార్జ్ తహసీల్దార్‌గా చంద్రశేఖర్



కుల్కచర్ల: మండల ఇన్‌చార్జ్ తహసీల్దార్‌గా డిప్యూటీ తహసీల్దార్ చంద్రశేఖర్‌కు బాధ్యతలు అప్పగించారు. గురువారం ఆయన బాధ్యతలు స్వీకరించారు. తహసీల్దార్ మురళీధర్ దీర్ఘకాలిక సెలవుపై వెళ్లడంతో కార్యాలయంలో విధులు నిర్వహిస్తున్న డీటీకి ఇన్‌చార్జ్ బాధ్యతలు అప్పగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రెవెన్యూ నూతన చట్టాలను ప్రజలకు అవగాహన కల్పిస్తూ శాఖాపరమైన సమస్యల పరిష్కారానికి అందరితో కలిసి ముందుకు సాగుతామని తెలిపారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి

కుంభకోణాలు చేసేవారికి బీజేపీలో చోటులేదు

ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి

అనంతగిరి: కుంభకోణాలు చేసే వారికి బీజేపీలో చోటు ఉండదని చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి అన్నారు. ఇటీవల పార్టీ జిల్లా అధ్యక్షుడిగా ఎన్నికైన డాక్టర్ రాజశేఖర్‌రెడ్డి అభినందన సభను గురువారం పట్టణంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన ఎంపీ మాట్లాడుతూ.. కేసీఆర్ ఫ్యామిలీ నుంచి ఆయన కూతురు కవిత కాంగ్రెస్‌లోకి వెళ్తుందని, కొడుకు కేటీఆర్ బీజేపీలో చేరుతారని వస్తున్న వార్తలపై స్పందించారు. లిక్కర్ స్కాం, ఫార్ములా ఈ రేస్ వంటి కేసుల్లో ఇరుక్కున్న వారు ఇతర పార్టీలవైపు చూస్తున్నారని ఎద్దేవా చేశారు. మనమంతా కష్టపడి పని చేస్తే భవిష్యత్‌లో జిల్లాలోని మూడు ఎమ్మెల్యే స్థానాలను గెలుచుకోవచ్చని ధీమా వ్యక్తం చేశారు. ప్రధాని మోదీ నిజమైన దేశభక్తి కలిగిన నాయకుడన్నారు. ప్రతి ఒక్కరూ పార్టీ సిద్ధాంతాలకు కట్టుబడి పనిచేయాలని, కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లి పార్టీని బలోపేతం చేయాలన్నారు. జిల్లాలో అందరిని కలుపుకొని ముందుకు సాగాలన్నారు. సమాజసేవలో ఉన్న ఓ డాక్టర్‌ను జిల్లా అధ్యక్షుడిగా చేయడం సంతోషకరమన్నారు. అనంతరం పార్టీ జిల్లా అధ్యక్షుడు రాజశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ.. తనకు అవకాశం ఇచ్చిన రాష్ట్ర, జిల్లా ముఖ్యనేతలకు ధన్యవాదాలు తెలిపారు. జిల్లాలో అందరిని కలుపుకొని పోతామని అన్నారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో తమ సత్తా చాటుతామన్నారు. కార్యక్రమంలో తెలంగాణ సాధు పరిషత్ అధ్యక్షుడు శ్రీ శంకర్‌స్వామి, రామ్‌ధారి అఖండ పీఠాధిపతి శ్రీ వేదయోగి మహరాజ్, కృష్ణ యజుర్వేద పండితుడు డాక్టర్ మన్యురింద్ర శర్మ, జిల్లా ఇన్‌చార్జి పగడాకుల శ్రీనివాస్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ప్రహ్లాదరావు, మాధవరెడ్డి, సదానందరెడ్డి, రమేష్‌కుమార్, పరమేశ్వర్ రెడ్డి, రాష్ట్ర ఓబీసీ మోర్చా ప్రధాన కార్యదర్శి ఈశ్వరప్ప, పార్టీ పట్టణ అధ్యక్షురాలు యాస్కి శిరీష, నాయకులు వెంకటయ్య, పాండు గౌడ్, శ్రీధర్‌రెడ్డి, నరోత్తంరెడ్డి, నందు పాల్గొన్నారు.

ఐటీఐని సందర్శించిన ఎంపీ
మర్పల్లి: మండల కేంద్రంలోని ఐటీఐ కళాశాలను గురువారం ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి సందర్శించారు. ఈ సందర్భంగా కళాశాలలో ఉన్న కోర్సుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. మౌలిక వసతులపై ఆరా తీశారు. కార్యక్రమంలో అధ్యాపకులు, బీజేపీ మండల అధ్యక్షుడు రామేశ్వర్‌రెడ్డి, జిల్లా కార్యదర్శి మల్లేశం, నాయకులు బలరాంగౌడ్, అన్నపూర్ణ, మహేశ్వరి, శ్రీమంత్‌కుమార్, సంగమేష్ తదితరులు పాల్గొన్నారు.



రైతులకు జీలుగ విత్తనాలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే కాలె యాదయ్య

అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు

- సకాలంలో పూర్తి చేసుకుంటే బిల్లులు మంజూరు చేస్తాం
- ఎమ్మెల్యే కాలె యాదయ్య

నవాబుపేట: కాంగ్రెస్ ప్రభుత్వం రైతుల పక్షపాతి అని, రైతుల మేలే ధ్యేయంగా ముందుకు సాగుతోందని ఎమ్మెల్యే కాలె యాదయ్య అన్నారు. గురువారం మండల కేంద్రంలోని రైతు వేదికలో అన్నదాతలకు సబ్సిడీపై జీలుగ విత్తనాలు పంపిణీ చేశారు. అనంతరం నవాబుపేటలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులను ప్రారంభించి మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం పేదలు, రైతుల సంక్షేమం కోసం అనేక పథకాలు అమలు చేస్తోందని అన్నారు. సబ్సిడీపై విత్తనాలు, వ్యవసాయ పరికరాలు పంపిణీ చేసిన ఘనత కేవలం కాంగ్రెస్ పార్టీకి దక్కుతుందన్నారు. వ్యవసాయ అధికారులు రైతులకు అందుబాటులో ఉండి ఎప్పటికప్పుడు సూచనలు, సలహాలు ఇవ్వాలని సూచించారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా కృషి చేస్తామని పేర్కొన్నారు. అర్హులకు ఇందిరమ్మ ఇళ్లు ఇచ్చి తీరుతామన్నారు. మొదటి విడతలో ఇళ్లు మంజూరైన లబ్ధిదారులు వెంటనే నిర్మాణాలు చేపట్టి పూర్తి చేస్తే బిల్లులు చెల్లిస్తామన్నారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ రామ్‌రెడ్డి, ఏఎంసీ చైర్మన్ గీతాసింగ్ నాయక్, ఎంపీడీవో అనురాధ, మండల వ్యవసాయ అధికారి జ్యోతి, ఇన్‌చార్జ్ తహసీల్దార్ శ్రీలత, ఎంపీఓ విజయ్‌కుమార్, ఏఈవోలు, మండల నాయకులు ప్రభాకర్, నరసింహారెడ్డి, రాజశేఖర్‌రెడ్డి, ఖదీర్, అనంత రామ్ పాల్గొన్నారు.

అంకితభావంతో పనిచేయాలి
విద్యాశాఖ కమిషనర్ నరసింహారెడ్డి



మాట్లాడుతున్న నరసింహారెడ్డి

అనంతగిరి: వికారాబాద్‌లోని డైట్ కళాశాలలో జరుగుతున్న తెలుగు ఉపాధ్యాయుల శిక్షణ తరగతుల కార్యక్రమాన్ని గురువారం రాష్ట్ర విద్యాశాఖ కమిషనర్ అండ్ డైరెక్టర్ నరసింహారెడ్డి ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉపాధ్యాయులు అంకితభావంతో పనిచేస్తూ విద్యార్థుల నైపుణ్యాలను మెరుగుపరిచేందుకు కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో డీఈఓ రేణుకాదేవి, రిసోర్స్ పర్సన్లు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలులో నిర్లక్ష్యం వద్దు
అడిషనల్ కలెక్టర్ లింగ్యానాయక్

దోమ: ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఇబ్బందులు లేకుండా చూడాలని అడిషనల్ కలెక్టర్ లింగ్యానాయక్ సూచించారు. గురువారం దోమ మండలం ఐనాపూర్ కొనుగోలు కేంద్రాని సందర్శించి రైతులతో మాట్లాడారు. వర్షాలు పడుతుండటంతో ధాన్యం ఆరబెట్టుకునేందుకు రైతులు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. తేమ శాతం ఎక్కువగా ఉన్నా ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తేవాలని రైతులకు సూచించారు. కార్యక్రమంలో టీటీ నర్సింహులు, ఆర్ఐలు సుదర్శన్, రాంచంద్రరావు, ఐకేపీ సీసీ సుగుణమ్మ, ఎంపీటీసీ మాజీ సభ్యులు విజయ, ఆంజనేయులు పాల్గొన్నారు.

ఫోర్ లేన్‌కు గ్రహణం వీడేనా?



సెంట్రల్ లైటింగ్ సిస్టంకు నోచుకోని ధారూరు ప్రధాన రహదారి

ధారూరు: తాండూరు–వికారాబాద్ వయా ధారూరు ఫోర్ లేన్ రహదారి నిర్మాణ పనులకు నిధులు మంజూరయ్యాయని అధికారులు చెబుతున్నా పనులు మాత్రం ప్రారంభం కావడంలేదు. ఈ పనులు పూర్తయితే ధారూరు మండల కేంద్రంలోని 16వ కిలో మీటర్ నుంచి 17.5 కిలో మీటర్ పీఎస్ వరకు రోడ్డుతో పాటు సెంట్రల్ లైటింగ్ సిస్టం ఏర్పాటవుతుంది. 20 మీటర్ల వెడల్పుతో రోడ్డును విస్తరించడానికి గత ప్రభుత్వ హయాంలో నిధులు మంజూరయ్యాయి. కానీ పనులకు మాత్రం మోక్షం లభించలేదు. దీంతో సెంట్రల్ లైటింగ్ సిస్టం ఏర్పాటు ఏళ్లు గడుస్తున్నా ఎక్కడ వేసిన గొంగడి అక్కడే అన్న చందంగా తయారైంది. ఇందుకోసం 2018లో అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం రూ. కోటి మంజూరు చేసింది. రోడ్డు వేసిన అధికారులు సెంట్రల్ లైటింగ్ సిస్టంకు మంగళం పాడారు. ఈ విషయమై అధికారులను వివరణ కోరగా నిధులు లేని కారణంగా పనులు చేపట్టలేదని పేర్కొన్నారు. దీంతో మంజూరైన నిధులు ఏమయ్యాయని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. ప్రస్తుత ప్రభుత్వమైనా సెంట్రల్ లైటింగ్ సిస్టం ఏర్పాటుకు నిధులు మంజూరు చేయాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.



మెగా జాబ్‌మేళాకు భారీగా తరలివచ్చిన నిరుద్యోగులు

ఉద్యోగ జాతర

మెగా జాబ్‌మేళాకు వేలాదిగా తరలివచ్చిన అభ్యర్థులు

- 63 కంపెనీల ప్రతినిధుల హాజరు
- ఉద్యోగాల కోసం దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు 4,200 మంది
- అర్హత సాధించిన వారు 4వేల మంది
- కార్యక్రమం విజయవంతం కావడంతో ఎమ్మెల్యే బీఎంఆర్ హర్షం

తాండూరు: ఉద్యోగ.. ఉపాధి అవకాశాలు లేని నియోజకవర్గ యువతకు గురువారం నాటి మెగా జాబ్‌మేళా సరికొత్త ఆశలు రేకెత్తించింది. ఈ ప్రాంతానికి చెందిన యువకులు ఉద్యోగాలు లేక ఆర్థిక కష్టాలను ఎదుర్కొంటున్నారు. తాండూరు నియోజకవర్గం కర్ణాటక సరిహద్దులో ఉండటంతో ఉద్యోగ అవకాశాలు అంతంతమాత్రంగానే ఉన్నాయి. ఈ ప్రాంతంలో అధికంగా నాపరాతి పరిశ్రమలు, గనులు ఉన్నాయి. వీటిని పని చేయడమంటే ఎంతో శ్రమించాల్సి ఉంటుంది. దీంతో యువకులు అయిష్టత చూపుతున్నారు. చాలా కాలంగా పీడిస్తున్న నిరుద్యోగ సమస్యకు చెక్ పెట్టాలని భావించిన ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి ప్రభుత్వ రంగ సంస్థ ఈజీఎంఎం సౌజన్యంతో గురువారం తాండూరు పట్టణంలో మెగా ఉద్యోగ మేళా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి నియోజకవర్గంలోని యాలాల, పెద్దేముల్, కోట్‌పల్లి, బషీరాబాద్, తాండూరు మండలాల తోపాటు, తాండూరు మున్సిపాలిటీ నుంచి వేల సంఖ్యలో నిరుద్యోగులు వచ్చారు. వివిధ ఉద్యోగాల కోసం దరఖాస్తు చేసుకున్నారు. 63 కంపెనీలు 11వేల ఉద్యోగాల భర్తీ కోసం అర్జీలు స్వీకరించాయి. అభ్యర్థులతో పట్టణంలోని వినాయక కన్వెన్షన్ ప్రాంగణం జనసంద్రంగా మారింది. తల్లిదండ్రులు తమ పిల్లలను వెంటబెట్టుకొచ్చారు. దాదాపు 8 నుంచి 9వేల మంది వరకు నిరుద్యోగులు హాజరయ్యారు. వీరిలో 4వేల మంది ఉద్యోగాలకు అర్హత సాధించారు. దరఖాస్తు ఫారాలు నింపేందుకు అభ్యర్థులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. అధికారులు, ఉపాధ్యాయులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు వారికి సాయం చేశారు. అభ్యర్థుల కోసం హెల్ప్ లైన్ సెంటర్, వైద్య సేవలను అందుబాటులో ఉంచారు. అర్హత పొందిన వారికి నియామక పత్రాలు అందించారు.

ఉద్యోగాల్లో రాణించాలి: ఎమ్మెల్యే

మెగా జాబ్‌మేళాలో ఉద్యోగాలు సాధించిన వారు ఆ రంగంలో రాణించాలని ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి సూచించారు. గురువారం తాండూరు పట్టణంలోని వినాయక కన్వెన్షన్ హాల్‌లో ఈజీఎంఎం సౌజన్యంతో జాబ్‌మేళా నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ఎమ్మెల్యే ప్రారంభించి మాట్లాడారు. నియోజకవర్గానికి చెందిన నిరుద్యోగులకు నాలుగు వేల ఉద్యోగాలు రావడం తాండూరు చరిత్రలోనే ఇదే తొలిసారి అన్నారు. ఈ కార్యక్రమం విజయవంతానికి కృషి చేసిన రెవెన్యూ, పోలీసు, పంచాయతీరాజ్, మున్సిపల్, వైద్య శాఖ అధికారులకు ధన్యవాదాలు తెలిపారు. అనంతరం ఉద్యోగాలు సాధించిన వారికి నియామక పత్రాలను అందించారు. కార్యక్రమంలో రాష్ట్ర ఆర్థిక సంఘం సభ్యుడు రమేష్ మహరాజ్, వైశ్య కార్పొరేషన్ చైర్‌పర్సన్ కల్వ సుజాత, ఎస్పీ నారాయణరెడ్డి, సబ్ కలెక్టర్ ఉమాశంకర్ ప్రసాద్, డీఆర్‌డీఓ కృష్ణన్, మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ తాటికొండ స్వప్న, డీసీసీబీ మాజీ చైర్మన్ లక్ష్మారెడ్డి, వైస్ చైర్మన్ రవిగౌడ్, డీఎస్పీ బాలకృష్ణారెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్లు పట్లోళ్ల బాల్‌రెడ్డి, మాధవరెడ్డి, పీసీసీ ప్రధాన కార్యదర్శి ధారాసింగ్, పీఏసీఎస్ చైర్మన్ సురేందర్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు హబీబ్‌లాలా, నాయకులు పట్లోళ్ల నర్సింహులు, ఉత్తమ్‌చంద్ తదితరులు పాల్గొన్నారు.



యువతికి నియామకపత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి, అధికారులు

సంతోషంగా ఉంది



మెగా జాబ్‌మేళాలో ఉద్యోగం రావడం సంతోషంగా ఉంది. కొంత కాలంగా జాబ్ కోసం ఎవరిని సంప్రదించాలనే విషయం తెలియక ఇబ్బంది పడ్డా. ఇలాంటి సమయంలో జాబ్‌మేళా ఏర్పాటు చేసినట్లు తెలిసి ఇక్కడికి వచ్చా. తనకు నచ్చిన కంపెనీలో ఉద్యోగం వచ్చింది. కార్యక్రమం నిర్వహించిన ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డికి రుణపడి ఉంటా.

– గిరిజ, తాండూరు

నెలకు రూ.20 వేల వేతనం



జాబామేళాలో దరఖాస్తు చేసుకున్న గంట వ్యవధిలోనే ఉద్యోగం లభించింది. ప్రతి నెలా రూ.20 వేల వేతనం. నియామక పత్రం అందుకోవడం చాలా ఆనందంగా ఉంది. కుటుంబంపై ఆర్థిక భారం తగ్గుతుంది. మాలాంటి వాళ్లకు ఉద్యోగమేళా ఎంతో మేలు చేసింది. నిర్వాహకుల సేవను మరచిపోలేం.

– సుప్రియ, కరన్‌కోట్, తాండూరు మండలం

క్లుప్తంగా

ఎదురెదురు బైకుల ఢీ

ఇద్దరికి తీవ్ర గాయాలు

ధారూరు: ఎదురెదురుగా వస్తున్న రెండు బైకులు ఢీకొన్న ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలైన సంఘటన మండల కేంద్రంలో గురువారం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. అల్లిపూర్ గ్రామానికి చెందిన అబ్దుల్(35) హైదరాబాద్‌లోని లంగర్ హౌస్ పీఎస్‌లో ట్రాఫిక్ హోంగార్డుగా విధులు నిర్వహిస్తున్నారు. ఆయన పెద్దేముల్‌లో తమ బంధువుల ఇంట్లో శుభకార్యానికి హాజరై తిరిగి స్వగ్రామానికి బైక్‌పై వెళ్తున్నారు. ఈ క్రమంలో ధారూరుకు చెందిన రోహిత్, రాము, నర్సింహ అనే యువకులు ఒకే బైక్‌పై రుద్రారం వైపు వెళ్తూ.. మార్గమధ్యలో డబుల్ బెడ్‌రూం ఇళ్ల వద్ద అబ్దుల్ బైక్‌ను ఢీకొట్టారు. ఈ ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు వెంటనే క్షతగాత్రులను వికారాబాద్‌లోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం అబ్దుల్ పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలిసింది. రోహిత్‌కు సైతం తీవ్ర గాయాలయ్యాయి. మిగతా వారు సైతం గాయపడ్డారు.

పోగొట్టుకున్న ఫోన్ల అందజేత



బాధితులకు ఫోన్లు అందజేస్తున్న ఎస్‌ఐ అరుణ్‌కుమార్

నవాబుపేట: ఎవరైనా ఫోన్లు పోగొట్టుకున్నా, చోరీకి గురైనా నేరుగా వచ్చి పోలీసులకు ఫిర్యాదు చేయాలని నవాబుపేట ఎస్‌ఐ అరుణ్ కుమార్ సూచించారు. మండల పరిధిలోని ఆర్కతల గ్రామానికి చెందిన పవన్, బాల్‌రెడ్డి గూడకు చెందిన సునీతలు 15 రోజుల క్రితం వారి ఫోన్లు పోగొట్టుకున్నారు. సీఈఐఆర్ ద్వారా వారి ఫోన్లను రికవరీ చేసి గురువారం బాధితులకు ఎస్‌ఐ అందజేశారు. నేటి సాంకేతిక యుగంలో పోగొట్టుకున్న వస్తువులను తొందరగా తెలుసుకోవచ్చన్నారు.

ఆర్టీసీ బస్సులో సీటు కోసం కొట్లాట



బస్సులో కొట్టుకుంటున్న ప్రయాణికులు

పరిగి: ఆర్టీసీ బస్సులో సీటు కోసం ప్రయాణికులు కొట్టుకున్న ఘటన గురువారం పరిగి–వికారాబాద్ బస్సులో చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. పరిగి–వికారాబాద్ మార్గంలో వికారాబాద్ డిపోకు చెందిన బస్సులు నడుస్తుంటాయి. ప్రయాణికుల రద్దీ ఎక్కువైనా బస్సులు పెంచకపోవడంతో నిత్యం కిటకిటలాడుతూ వెళ్తుంటాయి. గురువారం పరిగి నుంచి వికారాబాద్ వెళ్లే ఆర్టీసీ బస్సులో ప్రయాణికులు ఎక్కాడు. సీటు విషయంలో ఇరువురు గొడవ పడ్డారు. దీంతో రెండు కుటుంబాలకు చెందిన మహిళలు, పురుషులు, మరో ప్రయాణికుడు ఒకరిని ఒకరు కొట్టుకున్నారు. ప్రయాణికుల రద్దీ కారణంగానే కొట్లాట జరుగుతుందని, బస్సుల సంఖ్య పెంచాలని పలువురు కోరుతున్నారు.

పిడుగుపాటుకు ఆవు మృతి



కళేబరం

దోమ: పిడుగుపాటుకు ఓ ఆవు మృతి చెందింది. ఈ ఘటన మండల పరిధిలోని కొత్తపల్లిలో చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన రాజమోని రాజు జీవనోపాధి కోసం ఆవులను కొనుగోలు చేశారు. బుధవారం రాత్రి కురిసిన వర్షానికి ఓ ఆవుపై పిడుగు పడింది. గురువారం తెల్లవారుజామున పొలానికి వెళ్లిన బాధిత రైతు ఓ ఆవు మృతి చెందడంతో కన్నీటి పర్యాంతమయ్యారు. తమని ప్రభుత్వమే ఆదుకోవాలని వేడుకున్నారు.

షార్ట్ సర్క్యూట్‌తో హోటల్ దగ్ధం

షాద్‌నగర్‌రూరల్: షార్ట్ సర్క్యూట్‌తో ఓ హోటల్ దగ్ధమైన సంఘటన ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని ఎలికట్టలో గురువారం చోటుచేసుకుంది. స్థానికుల వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన చాకలిచంద్రయ్య హోటల్ నిర్వహిస్తూ జీవనోపాధిని పొందుతున్నాడు. బుధవారం రాత్రి ఎప్పటిలాగే హోటల్‌ను మూసివేసి ఇంటికి వెళ్లాడు. అర్ధరాత్రి దాటిన తరువాత షార్ట్ సర్క్యూట్ కావడంతో హోటల్‌లోని సామగ్రి, వస్తువులు పూర్తిగా దగ్ధమయ్యాయి. గురువారం తెల్లవారుజామున చంద్రయ్య చూడగా దట్టమైన పొగతో నిండిపోయింది. హోటల్‌లోని ఫ్రిడ్జ్‌లు, కౌంటర్‌లు, కంప్యూటర్, ప్రింటర్, సీసీ కెమెరాల ఎక్విప్‌మెంట్, ఫ్యాన్‌లు, కుర్చీలు, కూల్ డ్రింక్, వాటర్ బాటిళ్లు పూర్తిగా కాలిపోయాయి. విషయాన్ని తెలుసుకున్న ఆర్‌ఐ సలీం, పంచాయతీ కార్యదర్శి తేజస్విని ఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించారు. ఈ షార్ట్ సర్క్యూట్‌తో దాదాపు రూ.2లక్షల ఆస్తి నష్టం జరిగినట్లు హోటల్ యజమాని చంద్రయ్య తెలిపారు. ప్రభుత్వం వెంటనే స్పందించి ఆర్థిక సహాయాన్ని అందించాలని కోరారు.

పంట మార్పిడితో మేలు

రైతులు అధిక దిగుబడి పొందే అవకాశం

- నేలలో పెరగనున్న భూసారం
- వ్యవసాయ అధికారుల సూచన



నాగలితో విత్తనాలు విత్తుకుంటున్న రైతు

పరిగి: ఒకే రకమైన పంటల సాగుతో భూసారం క్రమంగా తగ్గుతుందని వ్యవసాయ శాస్త్రవేత్తలు హెచ్చరిస్తున్నారు. దీని ఫలితంగా దిగుబడి క్షీణించి అన్నదాతలు తీవ్రంగా నష్టపోయే ప్రమాదం ఉందని పేర్కొంటున్నారు. ఒకే నేలలో సాగు చేసే పంటలను తరచూ మార్చాలని సూచిస్తున్నారు. పంట మార్పిడి చేయడం ద్వారా అధిక దిగుబడి సాధించి ఆర్థికంగా ఎదిగేందుకు వీలుంటుంది. సంవత్సరం పంట మార్పిడి చేయడంతో సాగు చేసిన పంట ఆరోగ్యంగా ఉండటంతో పాటు మంచి దిగుబడిని ఇస్తుంది. నేలలో సైతం సమృద్ధిగా పోషకాలు వృద్ధి చెంది పంట దిగుబడులు పెరిగే ఆస్కారం ఉందని వ్యవసాయ అధికారులు సూచిస్తున్నారు.

చీడపీడలకు అడ్డుకట్ట

- ఒక పంటను ఒకే పొలంలో వరుసగా పండించడం వల్ల చీడపీడల ఉధృతి అధికం కావడానికి అనుకూల పరిస్థితులు ఏర్పడతాయి.
- పురుగు జీవితచక్రం నిరాటంకంగా ముగించుకుని తీవ్రమైన హాని కలిగించే స్థితికి చేరుకుంటుంది.
- పంట మార్పిడి చేసినప్పుడు పురుగు జీవిత చక్రం ఛేదించబడుతుంది. ఎందుకంటే ఒక పంటపై ఆశించే పురుగులు మరొక పంటపై ఆశించడం సాధారణంగా జరగదు.
- వేగంగా వృద్ధి చెందే కొన్ని రకాల పురుగులను పంటమార్పిడి వల్ల అదుపులో పెట్టవచ్చు.
- ఒకే లోతు వ్యవస్థ కలిగిన పంటలను ఉదాహరణకు పత్తి, మిరప, మొదలైన వాణిజ్య పంటలను మార్పిడి చేయకుండా సాగు చేయడం వల్ల ఒకే లోతు పొరల నుంచి పోషకాలు తీసుకోవడంతో నేల నిస్సారమవుతుంది.
- వరి, వేరుశనగ, జొన్న, మొక్కజొన్న, వంటి పైర్లు నేలపై పొరల నుంచి పోషకాలను తీసుకుంటాయి.
- నేల భౌతిక లక్షణాలు స్వభావం దెబ్బతినకుండా ఉండటానికి చీడపీడల అభివృద్ధిని నిరోధించడానికి పంటమార్పిడి చేయాలి.
- అప్పుడప్పుడు అవసరాన్ని బట్టి పశుగ్రాసం కోసం గడ్డిజాతి పైర్లు భూసారాన్ని పెంచడానికి పచ్చిరొట్ట పైర్లు వేసుకోవాలి.

ప్రయోజనాలు ఇవే!

- వరి తర్వాత మినుము, పెసర, శనగ వేయడంతో సుడి దోమ, టుంగ్రో వైరస్ నివారించవచ్చు.
- పత్తి వేసిన పొలంలో మొక్కజొన్న, జొన్న, నువ్వులు, మినుములు వేస్తే లద్దె పురుగు, పచ్చ పురుగుల బెడద ఉండదు.
- జొన్న, మొక్కజొన్న తర్వాత కంది సాగు చేస్తే కాయతొలుచు పురుగు ఉధృతి తగ్గుతుంది.
- వరి సాగు చేసే పొలాల్లో ముందుగా పప్పు ధాన్యాలను సాగు చేయడంతో నేల సారవంతమవుతుంది.
- వేరుశనగలో ఆకు ముడతను నివారించేందుకు పప్పుజాతికి చెందిన పైర్లతో మార్పిడి చేయాలి.
- కంది మిరప పంటల్లో ఎండుతెగులు నివారణకు జొన్న, మొక్కజొన్న పంటలతో మార్పిడి చేయాలి.
- నులి పురుగు సమస్య అధికంగా ఉన్న ప్రాంతాల్లో వేరుశనగ, మిరప వంటి పైర్ల సాగును కొన్ని పంట కాలాల వరకు ఆపాలి.
- ఆహార పంటలైన వరి, జొన్న, మొక్కజొన్న, సజ్జ పైర్లను పప్పుజాతి పైర్లయిన పెసర, మినుము, వేరుశనగ, పంటలతో మార్పిడి చేయాలి.
- ఆహార వాణిజ్య పంటలను పశుగ్రాస పైర్లతో ఒకసారి పప్పుజాతి పైర్లతో మరోసారి మార్పిడి చేయడం లాభదాయకం.

అధిక దిగుబడి



రైతులు ఒకే పంటను తరచూ సాగు చేయరాదు. ఒకే రకమైన పంటలను సాగు చేయడంతో మొక్కలకు అవసరమైన పోషకాలు అందక దిగుబడులు తగ్గిపోతాయి. అంతే కాకుండా రోగకారక పురుగుల జీవితచక్రం ముగించుకుని రోగాలు ఉధృతి పెరుగుతుంది. అంతుకే రైతులు వరుసగా ఒకే రకమైన పంటను సాగు చేయరాదు.

– లక్ష్మీకుమారి, ఏడీఏ, పరిగి

12 గంటలు సోదాలు

ఇబ్రహీంపట్నం తహసీల్ కార్యాలయంలో అర్ధరాత్రి వరకు ఏసీబీ తనిఖీలు

- ఫోన్ సంభాషణల ఆధారంగా ఆర్‌ఐ రిమాండ్
- అధికారవర్గాల్లో కలకలం రేపిన దాడులు

ఇబ్రహీంపట్నం: అవినీతి ఆరోపణలతో ఇబ్రహీంపట్నం రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ కృష్ణను ఏసీబీ అధికారులు అరెస్టు చేసిన విషయంలో దాదాపు 12 గంటల పాటు విచారణ కొనసాగింది. బుధవారం తహసీల్ కార్యాలయానికి ఏసీబీ అధికారులు మధ్యాహ్నం 2 గంటలకు వచ్చి అర్ధరాత్రి 2 గంటల వరకు అక్కడే మకాం వేశారు. ఆర్డీఓ, తహసీల్దార్, డిప్యూటీ తహసీల్దార్లు వారితోనే ఉన్నారు. డబ్బులు డిమాండ్ చేసిన కృష్ణను విచారించి అర్ధరాత్రి రెండు గంటలకు నగరానికి తరలించారు. అనంతరం నాంపల్లిలోని ఏసీబీ ప్రత్యేక న్యాయస్థానంలో ఆయన్ని హాజరు పరిచి రిమాండ్‌కు తరలించారు. ఉమ్మడి రంగారెడ్డి జిల్లా రేంజ్ ఏసీబీ డీఎస్పీ ఆనంద్‌కుమార్‌తోపాటు సిబ్బంది సుదీర్ఘ సమయాన్ని తహసీల్దార్ కార్యాలయంలో సోదాలు చేస్తూ గడపడం గమనార్హం. ఈ సందర్భంగా ఆదిభట్లలోని 355 సర్వేనంబర్ భూమితో పాటు పలు రికార్డులను పరిశీలించినట్లు సమాచారం. రెడ్ హ్యాండెడ్‌గా ఆర్‌ఐ కృష్ణ పట్టుబడనప్పటికీ.. ఫిర్యాదుదారుడు అందజేసిన మొబైల్ ఫోన్ రికార్డుల ఆడియో ద్వారా సేకరించిన ఆధారాలతో అరెస్టు చేశారు.

ఉన్నతాధికారుల ప్రమేయంపై ఆరా

ఆదిభట్లలోని 355 సర్వేనంబర్‌లోని ఏడు గుంటల భూమిని ఆన్‌లైన్‌లో ఎక్కించే వ్యవహారంలో ఏసీబీకి ఆర్‌ఐ కృష్ణ చిక్కారు. ఆ పట్టాదారుడి ఎకరా 16 గుంటల భూమి ఆ సర్వేనంబర్‌లో ఉండగా.. కేవలం 7 గుంటల భూమి ఆన్‌లైన్‌లో నమోదు కాలేదు. ఇందుకు రూ.12 లక్షలు ఆర్‌ఐ కృష్ణ డిమాండ్ చేయగా రూ.9 లక్షలు చెల్లించేందుకు అంగీకారం కుదిరినట్లు ఆరోపణలున్నాయి. 15 రోజుల క్రితం 7 గుంటల భూమిని సంబంధిత పట్టాదారుడి పేరుపై రికార్డుల్లో అధికారులు నమోదు చేశారు. ఈ తతంగం ముగిసిన అనంతరం ఒప్పందం మేరకు రావాల్సిన డబ్బుల గురించి పట్టాదారుడి కుటుంబసభ్యులను ఆర్‌ఐ కృష్ణ డిమాండ్ చేయడంతో ఈ పరిణామాలు చోటుచేసుకున్నాయి. ఈ వ్యవహారంలో ఉన్నతాధికారుల పాత్ర ఏమైన ఉందా అనే అంశంపై ఏసీబీ అధికారులు ఆరా తీస్తున్నారు. అధికారుల విచారణలో ఆర్‌ఐ నోరు విప్పితేనే ఈ అంశంలోని పాత్రదారులు ఎవ్వరనేది స్పష్టం కానుంది.

ఎక్కడ చూసినా ఇదే చర్చ

ఏసీబీ దాడులతో అధికార వర్గాల్లో కలకలం రేగింది. బుధ, గురువారాల్లో ఇదే చర్చ నియోజకవర్గంగా జోరుగా కొనసాగింది. పట్టుబడిన ఆర్‌ఐ కృష్ణను విచారించే క్రమంలో ఇంకా ఎవరి పేర్లైనా వెల్లడిస్తాడేమోనన్న భయం రెవెన్యూ అధికారులకు పట్టుకుంది. ఈ దాడులతో వివిధ ప్రభుత్వ కార్యాలయాల సిబ్బందిలో సైతం భయాందోళనలు నెలకొన్నాయి. సుమారు 15 సంవత్సరాల క్రితం తహసీల్ కార్యాలయంపై ఏసీబీ అధికారులు దాడి చేసి అప్పటి ఓ సర్వేయర్‌ను పట్టుకున్న అనంతరం తిరిగి ఇప్పుడు జరిగిన దాడుల్లో ఆర్‌ఐ చిక్కడం హాట్ టాపిక్‌గా మారింది.

వర్షం తెచ్చిన తంటా



ధారూరులో కురుస్తున్న వాన



నాగసమందర్‌లో ధాన్యం బస్తాలపై కప్పిన కవర్లు

ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద రైతుల దిగాలు

ధారూరు: ఎడతెరపి లేకుండా కురుస్తున్న వానలతో జనజీవనం స్తంభించుకుపోతోంది. ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద అన్నదాతల కష్టాలు అన్నీ ఇన్నీ కావు. గురువారం మధ్యాహ్నం వరకు జాడలేని వాన సాయంత్రం కాగానే చినుకుతో ప్రారంభమై విజృంభించింది. మండల పరిధిలో ఆరుబయట, కల్లాల్లో ఆరబెడుతున్న వడ్లు తడవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. జిల్లా కలెక్టర్ నుంచి ఆదేశాలు ఉన్నా తేమ ఎక్కువ ధాన్యం కొనుగోలు చేయడానికి నాగసమందర్ కేంద్రంలో నిర్వాహకులు మొండికేస్తున్నారు. మండల స్థాయి అధికారుల పర్యవేక్షణ లేకపోవడమే కారణమని రైతులు ఆరోపించారు. ఇప్పటికైనా ఎలాంటి షరతులు లేకుండా ధాన్యాన్ని కొనుగోలు చేయాలని కోరుతున్నారు.

రైలు కింద పడి గుర్తు తెలియని వ్యక్తి మృతి

అనంతగిరి: ఓ గుర్తు తెలియని వ్యక్తి రైలు కింద పడి మృతి చెందిన సంఘటన గొల్లగూడ రైల్వేస్టేషన్ సమీపంలో చోటు చేసుకుంది. రైల్వే పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. బుధవారం అర్ధరాత్రి గొల్లగూడ స్టేషన్ యార్డు సమీపంలో ఓ గుర్తు తెలియని వ్యక్తి గూడ్స్ రైలు కింద పడి ఆత్మహత్య చేసుకుని చనిపోయాడు. గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. ఘటనా స్థలానికి వెళ్లిన వారు వివరాలు సేకరించారు. మృతుడి(25–30) ఒంటిపై నీలం రంగు హాఫ్ అండర్ వేయర్, తెలుపు రంగు బనియన్ ధరించి ఉన్నాడు. మృతదేహాన్ని వికారాబాద్ ప్రభుత్వ ఆస్పత్రి మార్చురీలో భద్రపరిచినట్లు రైల్వే హెడ్ కానిస్టేబుల్ తెలిపారు.

విద్యుదాఘాతంతో పాడి ఆవు మృతి

షాబాద్: విద్యుదాఘాతంతో ఓ పాడి ఆవు మృతి చెందిన సంఘటన మండల పరిధిలోని చర్లగూడలో గురువారం చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన నక్కల కిష్టయ్యకు చెందిన ఆవు మేత మేస్తూ మీరాపూర్ సమీపంలో విద్యుత్ టాన్స్‌ఫార్మర్ వద్దకు వెళ్లింది. ప్రమాదవశాత్తు విద్యుత్ తీగలు తగలడంతో షాక్ కొట్టి అక్కడిక్కడే మృతి చెందింది. దాని విలువ సుమారు రూ.లక్షల వరకు ఉంటుందని, ప్రభుత్వమే తనను ఆదుకోవాలని బాధిత రైతు కోరుతున్నాడు.

రంగాపూర్‌లో డీపీఎం విచారణ



సమావేశంలో మాట్లాడుతున్న డీపీఎం నర్సింహులు

పరిగి: మండల పరిధిలోని రంగాపూర్‌లో మహిళా సంఘాల నుంచి విలేజ్ బుక్ కీపర్ డబ్బులు వసూలు చేస్తున్నారని సభ్యులు ఆందోళన చేయడంతో గురువారం డీపీఎం నర్సింహులు విచారణ చేపట్టారు. గ్రామంలోని 10 మహిళా సంఘాల సభ్యులతో వివరాలను సేకరించారు. అనంతరం డీపీఎం మాట్లాడుతూ.. మహిళా సంఘాల ద్వారా విచారణ చేపట్టగా బుక్ కీపర్ ఎలాంటి డబ్బులు వసూలు చేసినట్టు తేలలేదన్నారు. ఒకరు తమ దగ్గర డబ్బులు వసూలు చేశారని, తన సంతకం లేకుండానే బ్యాంకులో రుణం తీసుకున్నారని చెప్పడంతో ఆ మహిళా సంఘ సభ్యురాలు గ్రూపు డిఫాల్ట్‌లో ఉన్నట్టు తేలింది. గ్రామంలోని కొంత మందికి వ్యక్తిగత కారణాల వల్ల ఇలా జరిగిందని, తమ నుంచి డబ్బులు వసూలు చేసినట్టు గ్రూపు సభ్యులు ఎవరూ చెప్పలేరన్నారు. కార్యక్రమంలో గ్రామ సంఘ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

పచ్చని చెట్లపై గొడ్డలివేటు

ధారూరు: అధికారుల అనాలోచిత చర్యతో పచ్చని చెట్లపై గొడ్డలివేటు పండింది. గురువారం మండల పరిధిలోని హరిదాస్‌పల్లి–చింతకుంట గ్రామాల మధ్యన విద్యుత్ తీగలకు తాకుతున్నాయన్న కారణంతో చెట్లను కాండం వరకు నరికేశారు. గతంలో హరితహారంలో భాగంగా రోడ్డుకు ఇరువైపులా ఈ మొక్కలను నాటారు. ఆ సమయంలో ట్రాన్స్‌కో, ఉపాధిహామీ సిబ్బందికి సమన్వయం లోపించడంతో మొక్కల పైనుంచి విద్యుత్ తీగలను ఏర్పాటు చేశారు. ప్రస్తుతం చెట్లు పెద్దవి కావడంతో ప్రత్యామ్నాయం లేకపోవడంతో నరికేస్తున్నారు. నాటేటప్పుడే అనువైన స్థలాన్ని ఎంచుకోవాలని పర్యావరణ ప్రేమికులు సూచిస్తున్నారు.



కాండం వరకు నరికి వేసిన చెట్లు

గుర్తు తెలియని జంతువు దాడిలో మేక మృతి



మేక కళేబరం వద్ద బాధిత రైతు



పాదముద్రలు

కుల్కచర్ల: గుర్తు తెలియని జంతువు దాడిలో మేక మృతి చెందిన ఘటన చౌడాపూర్ మండల పరిధిలో చోటుచేసుకుంది. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. మందిపల్ గ్రామానికి చెందిన సంటి అంజయ్య బుధవారం రోజులాగే తన పొలం దగ్గర పశువులతో పాటుగా మేకలను కట్టేసి ఇంటికి వచ్చాడు. గురువారం తెల్లవారుజామున పొలానికి వెళ్లి చూడగా ఓ మేక రక్తపుమడుగులో పడి చనిపోయి ఉంది. ఎక్కువ శాతం మాంసం తినేసింది. కాగా పరిసర ప్రాంతాల్లో చిరుత ఆనవాళ్లు కనిపించాయని గ్రామస్తులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. బాధిత రైతు అటవీశాఖ అధికారులకు సమాచారం ఇవ్వగా ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ శ్రీధర్ ఘటనాస్థలికి చేరుకుని పాదముద్రలను పరిశీలించారు. రైతులు అటవీప్రాంతంలో పశువులను కట్టేయరాదని, ట్రాక్ కెమెరాలను ఏర్పాటు చేస్తామని ఆయన పేర్కొన్నారు.

ఆపరేషన్ వికటించి వ్యక్తి మృతి

చేవెళ్లలో ఘటన

- విజయ్ నర్సింగ్‌హోం ఎదుట బాధితుల ఆందోళన
- కేసు నమోదు చేసిన పోలీసులు

చేవెళ్ల: ఆపరేషన్ వికటించి ఓ వ్యక్తి మృతిచెందాడు. ఈ ఘటన గురువారం చేవెళ్లలో చోటుచేసుకుంది, పోలీసులు, బాధితుల వివరాల ప్రకారం.. మున్సిపల్ పరిధిలోని కేసారానికి చెందిన కల్లెంల నర్సింలు (50) వ్యవసాయం చేసుకుంటూ జీవించేవాడు. ఇతనికి కడుపులోని బొడ్డు వద్ద గడ్డ ఉందని వైద్యులు గుర్తించారు. ఈక్రమంలో గత బుధవారం విజయ్ నర్సింగ్‌హోంకు వెళ్లి డాక్టర్ విజయ్‌కుమార్‌ను కలిశాడు. చిన్న ఆపరేషన్ ద్వారా తొలగించేద్దామని చెప్పడంతో ఆస్పత్రిలో చేరాడు. సాయంత్రం వేళ శస్త్రచికిత్స చేసి గడ్డను తొలగించారు. ఇదిలా ఉండగా గురువారం ఉదయం నర్సింలు నోరు తడి ఆరిపోతోందని, పరిస్థితి విషమంగా ఉందని కుటుంబ సభ్యులు డాక్టర్‌కు చెప్పారు. ఏమీ కాదని చెప్పిన ఆయన గ్లూకోజ్ పెట్టినా, ఎక్కకపోవడంతో అనుమానం వచ్చి మహేందర్‌రెడ్డి ఆస్పత్రికి తీసుకెళ్లారు. పరిశీలించిన వైద్యులు అప్పటికే మృతిచెందినట్లు నిర్ధారించారు. వైద్యుల నిర్లక్ష్యంతోనే నర్సింలు చనిపోయాడని ఆరోపిస్తూ అతని బంధువులు మృతదేహంతో వచ్చి విజయ్ ఆస్పత్రి ఎదుట ఆందోళన చేపట్టారు. అప్పటికే డాక్టర్లందరూ వెళ్లిపోయారు. పోస్టుమార్టం నిమిత్తం బాడీని ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. మృతుడికి భార్య లక్ష్మమ్మ, ఇద్దరు కొడుకులు ఉన్నారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తుచేస్తున్నారు.

భౌభౌలతో బెంబేలు



హస్నాబాద్ వీధుల్లో సంచరిస్తున్న కుక్కలు

- వీధుల్లో గుంపులుగా శునకాల సంచారం
- చోదకులు, నడిచివెళ్లే వారిపై దాడి
- అశ్రద్ధ వహిస్తే ప్రమాదమంటున్న వైద్యులు

దుద్యాల్: శునకాల సమూహం పట్టణాలు, గ్రామాలు అనే తేడా లేకుండా స్వైర విహారం చేస్తున్నాయి. ఏ వీధిలో చూసినా గుంపులు గుంపులుగా తిరుగుతూ స్థానికులను హడలెత్తిస్తున్నాయి. దీంతో ప్రజలు బయటికి రావాలంటేనే జంకుతున్నారు. ఇదీ దుద్యాల్ మండల వ్యాప్తంగా వేధిస్తున్న సమస్య. ద్విచక్ర వాహనదారులను వెంబడిస్తూ తరచూ ప్రమాదాలకు గురి చేస్తున్నాయి. మండల కేంద్రం, హస్నాబాద్, కుదురుమల్ల, హకీంపేట, పోలేపల్లి, లగచర్ల తదితర గ్రామాలలో ఈ సమస్య మరీ ఎక్కువగా ఉంది. ప్రధాన వీధుల గుండా పాఠశాలకు వెళ్లేటప్పుడు గ్రామసింహాలను చూసి విద్యార్థులు భీతిల్లుతున్నారు. వారి తల్లిదండ్రులు సైతం ఆందోళన చెందుతూ, కుక్కల నియంత్రణకు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. ఉమ్మడి బొంరాపేట(దుద్యాల్, బొంరాస్‌పేట) మండలంలో ఈ ఏడాది కుక్కకాటు కింద 165 కేసులు నమోదయ్యాయి. ఇందులో రేబిస్ వ్యాధి సోకితే ప్రాణాలకే ముప్పు వాటిల్లే ప్రమాదం ఉంది.

రేబిస్ సోకిన కుక్కల లక్షణాలు

ఇంట్లో పెంచుకున్న కుక్కకు రేబిస్ వ్యాధి సోకితే ఎవరి మాట వినదు. ఇంట్లో ఆహారం సరిగా తీసుకోదు. తరచూ నోటి నుంచి సొంగ కారుస్తుంది. అంతే కాకుండా రెండు కాళ్ల మధ్యలో తోక ముడుచుకుంటుంది. ఇలా 14 రోజుల పాటు లక్షణాలను పరిశీలించి, వ్యాధి నిర్ధారణ చేసిన తర్వాత పశువైద్యులను సంప్రదించి చికిత్స చేయించాలి.

కుక్కకాటుకు తీసుకోవాల్సిన చర్యలు

కుక్క కరిచిన చోట వాటర్‌తో, బట్టలు ఉతికే సబ్బుతో కడగాలి. దీంతో 90 శాతం వైరస్ సోకుండా ఉంటుంది. గాయానికి కట్టు కట్టకూడదు. రక్తం పోతుందని కట్టు కడితే వైరస్ మరింత వ్యాపించే ప్రమాదం ఉంటుంది. వెంటనే డాక్టర్‌ను సంప్రదించి రేబిస్ వ్యాక్సిన్ వేయించుకోవాలి. కరిచిన విధానాన్ని పరిగణలోకి తీసుకుని రేబిస్ కుక్క అయితే దాన్ని బట్టి 5 నుంచి 7 ఇంజక్షన్లు వేయించుకోవాలి. కుక్క కాటుకు సంబంధించిన మందులు ప్రతి ప్రభుత్వ ఆస్పత్రుల్లో అందుబాటులో ఉంటాయి.

ఇటీవల ఒకరి మృతి

రేబిస్ వ్యాధితో ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన జిల్లాలోని పెద్దేముల్ మండలం ఇందూర్‌లో చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన ప్రవీణ్(32) వ్యవసాయం చేస్తూ జీవిస్తున్నాడు. రెండు నెలల క్రితం కుక్క కాటుకు గురయ్యాడు. చికిత్స తీసుకోవడంలో నిర్లక్ష్యం వహించాడు. ఈ క్రమంలో వాతావరణంలో మార్పులు రావడంతో ఈ నెల 25న ఒక్కసారిగా తీవ్ర అనారోగ్యానికి గురయ్యాడు. కుటుంబ సభ్యులు తాండూరులోని ఓ ఆస్పత్రికి తరలించగా, పరిస్థితి విషమించడంతో హైదరాబాద్‌కు రెఫర్ చేశారు. పరీక్షించి వైద్యులు ప్రవీణ్‌కు రేబిస్ వ్యాధి సోకినట్లు నిర్ధారించారు. తీవ్ర అస్వస్థతకు గురైన బాధితుడు మరుసటిరోజు మృతి చెందాడు.

టీకా వేయించాలి



కుక్కలు పెంచుకున్న వారు తప్పకుండా వాటి చిన్నతనంలోనే యాంటీ రేబిస్ టీకా వేయించాలి. ఎందుకంటే ఇంట్లో చిన్న పిల్లలు, వృద్ధులు శునకాలతో ప్రేమగా ఆడుకుంటారు. ఆ సమయంలో కుక్కలు మన శరీరంతో ఆనుకుని, నాలుకతో నాకడం వంటివి చేస్తాయి. చిన్నపిల్లలను దూరంగా ఉంచాలి.

– వెంకటయ్య, జూనియర్ పశు వైద్యుడు, కొడంగల్

ఔషధాలు ఉన్నాయి



కుక్కకాటు చికిత్సకు కావాల్సిన అన్ని రకాల ఔషధాలు అందుబాటులో ఉన్నాయి. బాధితులకు ఐదు రకాల టీకాలు అందించాల్సి ఉంటుంది. 0, 3, 7, 14, 28 రోజుల్లో వివిధ డోసుతో వ్యాక్సిన్ ఇవ్వాలి. కుక్క కాటుకు గురైతే వెంటనే వైద్యులను సంప్రదించాలి. లేకుంటే ప్రాణానికి ప్రమాదం.

– డాక్టర్ వందన, ప్రభుత్వ ఆస్పతి, హకీంపేట్



రేపటికి పాదుపు

పోస్టాఫీసు ద్వారా పేదలకు ఎన్నో రకాల ప్రయోజనాలు అందిస్తున్నట్లు తపాలా శాఖ అధికారులు తెలిపారు. 10లో▸



సంత.. సమస్యల చింత

పరిగి పట్టణంలో ప్రతి శుక్ర, శనివారాల్లో నిర్వహించే సంతలో వసతులు లేక వ్యాపారులు ఇబ్బంది పడుతున్నారు. 10లో▸



నేటితో ముగియనున్న..

మోమిన్‌పేటలోని జొన్నల కొనుగోలు కేంద్రాన్ని ఈ నెల 31తో మూసివేయనున్నట్లు అధికారులు తెలిపారు. 11లో▸

న్యూస్‌రీల్

పేదలందరికీ ఇందిరమ్మ ఇళ్లు

ఎమ్మెల్యే కాలె యాదయ్య



లబ్ధిదారులకు మంజూరు పత్రాలు అందజేస్తున్న ఎమ్మెల్యే యాదయ్య

నవాబుపేట: కాంగ్రెస్ అంటే పేదలు, రైతుల ప్రభుత్వమని ఎమ్మెల్యే కాలె యాదయ్య అన్నారు. శుక్రవారం మండలంలోని లింగంపల్లిలో లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అర్హులైన పేదలందరికీ ఇందిరమ్మ ఇళ్లు వస్తాయని, ఎవరూ ఆందోళన చెందాల్సిన పని లేన్నారు. పేదలకు ఇళ్లు కట్టిస్తున్న ఘనత కాంగ్రెస్ పార్టీకి దక్కుతుందన్నారు. అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందేలా చూస్తామని హామీ ఇచ్చారు. లబ్ధిదారులు వెంటనే ఇంటి నిర్మాణ పనులను ప్రారంభించాలని సూచించారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ రామ్‌రెడ్డి, ఎంఈఓ అబ్దుల్ రెహమాన్, మాజీ సర్పంచ్ నర్సింలు, ఎంపీటీసీ మాజీ సభ్యుడు పరమేష్, పంచాయతీ కార్యదర్శి వెంకటలక్ష్మి,రెడ్డి, నాయకులు నాగిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అక్రమ కట్టడాల కూల్చివేత



బస్టాండ్ ఎదుట అక్రమ కట్టడాలను తొలగిస్తున్న మున్సిపల్ అధికారులు

తాండూరు టౌన్: తాండూరు పట్టణంలోని ప్రధాన రోడ్డు మార్గానికి ఇరువైపులా వ్యాపారులు అక్రమంగా నిర్మించిన కట్టడాలను మున్సిపల్ అధికారులు శుక్రవారం కూల్చివేశారు. తాండూరు మీదుగా 167 (ఎన్) నేషనల్ హైవే వెళ్తుండటంతో ప్రధాన రోడ్డును ఇందుకు అనుగుణంగా విస్తరించనున్నారు. పనులు ఆలస్యం కావడంతో సదరు వ్యాపారులు ఇష్టానుసారంగా అనుమతి లేని చోట అక్రమంగా షెడ్లు, మెట్లు ఇతర కట్టడాలను ఏర్పాటు చేసుకున్నారు. దీంతో మున్సిపల్ అధికారులు పోలీసుల సహాయంతో కట్టడాలను కూల్చేశారు. తాండూరు బస్టాండు నుంచి చించోళి రోడ్డు మార్గంలో సెయింట్ మార్క్స్ పాఠశాల వరకు అక్రమ కట్టడాలను అధికారులు కూల్చేందుకు సమాయత్తమయ్యారు. ఈ సందర్భంగా పలువురు చిరు వ్యాపారులు అధికారుల తీరును తప్పు పట్టారు. ఏమాత్రం సమయం ఇవ్వకుండా హుటాహుటిన కూల్చేయడం సరికాదన్నారు. నిబంధనల ప్రకారమే అక్రమ కట్టడాలను తొలగిస్తున్నట్లు మున్సిపల్ అధికారులు తెలిపారు.

ఎన్‌ఎంఆర్‌పై సమీక్ష



అధికారులతో మాట్లాడుతున్న అడిషనల్ కలెక్టర్ లింగ్యానాయక్

అనంతగిరి: ప్రభుత్వ విభాగాల్లో వేతన సవరణ కమిటీ పరిగణనను బట్టి దినసరి కార్మికులకు జీత భత్యాలు చెల్లించేందుకు చర్యలు తీసుకోవాలని అడిషనల్ కలెక్టర్ లింగ్యానాయక్ అధికారులకు సూచించారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో నాన్ మాస్టర్ రోల్ ఉద్యోగ వేతన స్థిరీకరణ (ఎన్‌ఎంఆర్)పై వివిధ శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ విభాగాల్లో పని చేస్తున్న హాజరు పట్టిక(ఎన్‌ఎంఆర్)లో లేని కార్మికులకు వేతన సవరణ కమిటీ సిఫారసు మేరకు కనీస వేతనాలను అందించాలన్నారు. నైపుణ్యం, నైపుణ్యం లేని, పాక్షిక నైపుణ్యం కలిగిన దినసరి కార్మికులకు రెండు సంవత్సరాలకు ఒకసారి వేతనాల పెంపునకు అనుగుణంగా అందించాలన్నారు. గ్రామీణ, మున్సిపల్ పరిధిల్లో పనిచేసే కార్మికులకు కనీస వేతనాలు ఇవ్వాలని సూచించారు. సమావేశంలో కార్మిక శాఖ అసిస్టెంట్ కమిషనర్ వాల్యా నాయక్, డీహెచ్ఎస్ఓ సత్తార్, డీఎంహెచ్ఓ వెంకటరవణ, విద్యుత్ శాఖ ఎస్ఈ రవి ప్రసాద్, డీబీసీడీఓ ఉపేందర్ తదితరులు పాల్గొన్నారు.

రైతులకు కేంద్రం అండ

మొయినాబాద్: కేంద్ర ప్రభుత్వం రైతులకు అన్నివిధాలా అండగా ఉంటుందని చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వరరెడ్డి అన్నారు. మండల పరిధిలోని అప్పోజీగూడ, రెడ్డిపల్లి గ్రామాల కిసాన్ కవచ్ కార్యక్రమంలో భాగంగా శ్రీ అస్పద చారిటబుల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో క్షేమ జనరల్ ఇన్సూరెన్స్ లిమిటెడ్ సహకారంతో రైతులకు మందులు పిచికారీ చేసే సమయంలో వేసుకునే కిట్లు పంపిణీ చేశారు.

నో స్టాక్..!

జిల్లాలో ఎరువుల కొరత

- ఫెర్టిలైజర్ దుకాణాల చుట్టూ రైతుల ప్రదక్షిణలు
- దగ్గరపడుతున్న విత్తు సమయం
- ఆందోళనలో అన్నదాత



వికారాబాద్ పట్టణంలోని ఓ దుకాణంలలో విత్తనాలు కొనుగోలు చేస్తున్న రైతులు

వికారాబాద్: జిల్లాలో ఎరువుల కొరత రైతన్నను ఉక్కిరి బిక్కిరి చేస్తోంది. ఖరీఫ్ సీజన్ ప్రారంభమై వర్షాలు కురుస్తున్న తరుణంలో ఫెర్టిలైజర్ దుకాణా ల్లో ఎరువుల కొరత ఉండటం రైతులను ఆందోళనకు గురిచేస్తోంది. ఈ సారి వర్షాలు ముందుగానే పడుతున్న నేపథ్యంలో రైతులు కూడా విత్తుకు సిద్ధమవుతున్నారు. ఇప్పటికే ఎరువులు, విత్తనాల కొనుగోలుపై దృష్టి సారించారు. ప్రస్తుత సీజన్‌కు అవసరమైన ఎరువుల్లో 15 శాతం కూడా అందుబాటులో లేని పరిస్థితి ఉంది. ప్రస్తుతం దుక్కి ఎరువుగా వాడాల్సిన డీఏపీ కొరత తీవ్రంగా ఉంది. దీంతో దిక్కుతోచని స్థితిలో అన్నదాతలు ఉన్నారు.

అవసరం కొండంత.. ఉన్నది గోరంత

జిల్లాలో ఎరువుల అవసరం కొండంత ఉంటే ఉన్నది మాత్రం గోరంతే. సాగుకు సరిపడా విత్తనాలు ఉండటం రైతులకు కొంత మేర ఉపశమనం కలిగిస్తోంది. ఖరీఫ్ సీజన్‌లో 5,61,719 ఎకరాల్లో వివిధ రకాల పంటలు సాగు చేయవచ్చని వ్యవసాయ శాఖ అధికారులు అంచనా వేశారు. ఇందుకు 1,13,851 మెట్రిక్ టన్నుల ఎరువులు అవసరమని ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపారు. ప్రస్తుతం 14,429 మెట్రిక్ టన్నులు మాత్రమే అందుబాటులో ఉన్నాయి. ప్రస్తుత సీజన్‌కు 39,898 మెట్రిక్ టన్నుల యూరియా అవసరం ఉండగా కేవలం 8,088 మెట్రిక్ టన్నులు మాత్రమే అందుబాటులో ఉంది. డీఏపీ 27,516 మెట్రిక్ టన్నులు అవసరం కాగా 2,408 మెట్రిక్ టన్నులు అందుబాటులో ఉంది. ఎంఓపీ 8,585 మెట్రిక్ టన్నులు అవసరం కాగా 173 మెట్రిక్ టన్నులే ఉంది. కాంప్లెక్స్ ఎరువులు 35,305 మెట్రిక్ టన్నులు అవసరం ఉండగా 3,530 మెట్రిక్ టన్నులు ఉంది. ఎస్ఎస్‌పీ ఎరువులు 2,547 మెట్రిక్ టన్నులు అవసరం ఉండగా 230 మెట్రిక్ టన్నులు మాత్రమే అందుబాటులో ఉంది.

ఖరీఫ్ సాగు విస్తీర్ణం 5.61లక్షల ఎకరాలు

ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌లో మొత్తం 5.61లక్షల ఎకరాల విస్తీర్ణంలో ఆయా పంటలు సాగు చేయవచ్చునని వ్యవసాయ అధికారులు అంచనా వేశారు. గతేడాది 2.57లక్షల ఎకరాల్లో పత్తి సాగు చేయగా.. ఈ సారి 2.58 లక్షల ఎకరాల్లో సాగు చేసే అవకాశం ఉందరి అంచనా వేసింది. వరి 1,31,075 ఎకరాల్లో, కందులు 1.10లక్షల ఎకరాల్లో, మొక్కజొన్న 26,908 ఎకరాల్లో సాగు చేయవచ్చని భావిస్తున్నారు. పెసలు 14,568 ఎకరాలు , మినుములు 5,716 ఎకరాలు జొన్నలు 2,572 ఎకరాలు, సోయాబీన్ 2,043 ఎకరాలు, ఇతర పంటలు 7275 ఎకరాల్లో సాగవుతాయని అంచనా వేశారు. ప్రస్తుతం వరి, మొక్కజొన్న, జీలుగ, జనుము, సోయాబీన్, కంది విత్తనాలను అందుబాటులో ఉంచారు. ఫెర్టిలైజర్, సీడ్స్ దుకాణాల్లో అవసరం మేరకు పత్తి విత్తనాలు అందుబాటు ఉండేలా చర్యలు తీసుకుంటున్నట్లు అధికారులు తెలిపారు. జిల్లాకు ఆయా పంటలకు సంబంధించి 41,297 క్వింటాళ్ల విత్తనాలు, 5,16,426 పత్తి విత్తన ప్యాకెట్లు అవసరమని అంచనా వేశారు. ప్రస్తుతం పూర్తిస్థాయిలో అందుబాటులో ఉన్నట్లు అధికారులు పేర్కొన్నారు.

- జిల్లాలో ఖరీఫ్ సాగు విస్తీర్ణం 5,61,719 ఎకరాలు
- అవసరమైన ఎరువులు 1,13,851 మెట్రిక్ టన్నులు
- ప్రస్తుతం అందుబాటులో ఉన్నది 14,429 మెట్రిక్ టన్నులు
- అవసరమైన విత్తనాలు 41,297 క్వింటాళ్లు

ప్రభుత్వానికి నివేదించాం



ప్రస్తుత సీజన్‌కు ఏ మేరకు విత్తనాలు,ఎరువులు అవసరమో అంచనాలు తయారు చేసి ప్రభుత్వానికి పంపాం. సాగుకు సరిపడా విత్తనాలను అందుబాటులో ఉంచాం. డీఏపీ కొంత మేర కొరత ఉంది. ఈ విషయాన్ని ప్రభుత్వానికి నివేదించాం. త్వరలో వచ్చే అవకాశం ఉంది. నకిలీ విత్తనాల విషయంలో రైతులు జాగ్రత్తగా ఉండాలి.

– మోహన్‌రెడ్డి, జిల్లా వ్యవసాయాధికారి

వేడుకలు ఘనంగా నిర్వహిద్దాం



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రతీక్‌జైన్

- కలెక్టర్ ప్రతీక్‌జైన్
- రాష్ట్ర అవతరణ వేడుకలపై అధికారులకు దిశానిర్దేశం

అనంతగిరి: జూన్ 2న రాష్ట్ర అవతరణ వేడుకలను ఘనంగా నిర్వహిద్దామని, ఇందుకోసం పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ ప్రతీక్ జైన్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో రాష్ట్ర అవతరణ వేడుకలపై వివిధ శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో వేడుకలు నిర్వహించాలని ఆదేశించారు. ఎలాంటి లోటుపాట్లకు అవకాశం ఇవ్వరాదని సూచించారు. సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలు ప్రతిబింబించేలా స్టాళ్లను ఏర్పాటు చేయాలని ఆయా శాఖల అధికారులకు సూచించారు. పట్టణంలోని అమర వీరుల స్తూపాన్ని, సభాస్థలి వేదికను పూలతో అందంగా అలంకరించాలని ఉద్యానవన శాఖ అధికారులను ఆదేశించారు. ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పత్రాలు, నూతన రేషన్ కార్డులు, స్వయం సహాయక సంఘాలకు చెక్కుల పంపిణీ, గ్రామ పంచాయతీ అధికారులకు నియామక పత్రాలు అందజేసేందుకు ఏర్పాట్లు చేయాలన్నారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా బందో బస్త్ ఏర్పాట్లు చేయాలని పోలీస్ అధికారులకు సూచించారు. విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగకుండా చూడాలన్నారు. పాఠశాలల విద్యార్థులతో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించాలని డీఈఓ రేణుకాదేవికి సూచించారు. స్పీకర్ ప్రసాద్‌కుమార్ చేతులమీదుగా పతాకావిష్కరణ చేపట్టనున్నారు. కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్లు లింగ్యానాయక్, సుధీర్, అదనపు ఎస్పీ టి.వి.హనుమంత్ రావు, ఆర్డీఓ వాసుచంద్ర, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

కార్యకర్తల జోలికొస్తే ఊరుకోం

బీజేపీ జిల్లా అధ్యక్షుడు రాజశేఖర్‌రెడ్డి



మాట్లాడుతున్న రాజశేఖర్‌రెడ్డి తదితరులు

పూడూరు: తమ పార్టీ కార్యకర్తల జోలికి వస్తే ఊరుకునేది లేదని బీజేపీ జిల్లా అధ్యక్షుడు కొప్పుల రాజశేఖర్‌రెడ్డి అన్నారు. గురువారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడారు. పార్టీ నాయకుడు, సినిమా సెన్సార్ బోర్డు సభ్యుడు మల్లేష్ పటేల్‌పై అక్రమ కేసులు బనాయిస్తే చూస్తూ ఊరుకోమని హెచ్చరించారు. పోలీసులు ఏకపక్షంగా వ్యవహరించరాదని హితవు పలికారు. బీజేపీ నాయకులపై పెట్టిన అక్రమ కేసులను ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. లేకుంటే ఉద్యమిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు రాఘవేందర్, మాజీ అధ్యక్షుడు అనిల్, నాయకులు శ్రీశైలం, శివరాజ్, పాండు తదితరులు పాల్గొన్నారు.

డిగ్రీ అడ్మిషన్లకు సెకండ్ ఫేజ్ 'దోస్త్'

షాద్‌నగర్‌రూరల్: ఇంటర్మీడియెట్ విద్యను పూర్తి చేసిన విద్యార్థులు డిగ్రీ అడ్మిషన్లకు సెకండ్ ఫేజ్ దోస్త్ పోర్టల్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని గిరిజన సంక్షేమ గురుకుల మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ నీతాపోలె శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఔత్సాహిక విద్యార్థినులు జూన్ 9 వరకు రిజిస్ట్రేషన్ చేసేకునేందుకు ఆవకాశం ఉంద న్నారు. ఎంపీసీ,ఎంజెడ్సీ,బీజెడ్సీ, ఎంపీసీఎస్, బీఏ,బీకాం, ఇంటిగ్రేటెడ్ పీజీ కోర్సులు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. డిగ్రీ ప్రథమ సంవత్సరంలో చేరాలనుకునే విద్యార్థినులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మరిన్ని వివరాలకు 63050 51490, 98850 03390, 97034 41345 నంబర్లలో సంప్రదించాలని ఆమె సూచించారు.

యూరియా వాడకం తగ్గించండి

- పత్తి సాగులో మెలకువలు పాటించాలి
- రైతులకు వ్యవసాయ శాస్త్రవేత్తల సూచన

దుద్యాల్: పంట దిగుబడి పెరుగుతుందనే ఆశతో రైతులు యూరియా వాడకం పెంచారని, ఇది నష్టమే తప్ప ఎలాంటి ప్రయోజనం ఉండదని తాండూరు వ్యవసాయ పరిశోధన స్థానం శాస్త్రవేత్త రాజేశ్వర్ రెడ్డి, ఏరువాక కేంద్రం శాస్త్రవేత్త లక్ష్మణ్ తెలిపారు. శుక్రవారం మండలంలోని కుదురుమల్ల రైతు వేదికలో రైతు ముంగిట శాస్త్రవేత్తలు అనే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు రైతులు అడిగిన పలు ప్రశ్నలకు సమాధానం ఇచ్చారు. అనంతరం వారు మాట్లాడుతూ.. పంటల సాగులో రైతులు యూరియాను అధికంగా వాడుతున్నారని వెంటనే తగ్గించాలని సూచించారు. ఈ గ్రామ రైతులు అధికంగా పత్తి పంటను సాగు చేస్తుంటారని యాజమాన్య పద్ధతులు పాటించాలన్నారు. పత్తి పంటకు గులాబి రంగు పురుగు ఆశించి దిగుబడిని దెబ్బతీస్తుందని.. ఎలా నివారించాలో తెలియజేశారు. వరి, కంది, పెసరు పంటల సాగులో యాజమాన్య పద్ధతులను రైతులకు వివరించారు. భూసారం పెరగాలంటే పచ్చిరొట్ట ఎరువు సాగు చేయాలని సూచించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి నాగరాజు, కొడంగల్ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ వేణుగోపాలు, ఏఈవోలు జ్యోతి, రేణుక, భావన, మాణికేశ్వరి, కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకటయ్య, నాయకుడు సీతారాం నాయక్, మాజీ సర్పంచ్ రఘుపతి, పంచాయతీ కార్యదర్శి రాధ తదితరులు పాల్గొన్నారు.



పంటల సాగుపై రైతులకు అవగాహన కల్పిస్తున్న శాస్త్రవేత్త

నేత్రపర్వం.. రథోత్సవం

- వైభవంగా రేణుక ఎల్లమ్మ జాతర
- అమ్మవారి సేవలో ప్రముఖులు



ప్రత్యేక అలంకరణలో అమ్మవారు



రథాన్ని లాగుతున్న భక్తులు

తాండూరు రూరల్: మండలంలోని కొత్లాపూర్‌లో కొలువు దీరిన రేణుక ఎల్లమ్మ జాతర నెల రోజులగా వైభవంగా సాగుతోంది. ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం రథోత్సవం, సిడే వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఉదయం అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. ఆలయ చైర్మన్ నవీన్‌రెడ్డి అమ్మవారి విగ్రహాన్ని ఊరేగింపుగా ఆలయానికి తెచ్చారు. సిడేను పూలతో అందంగా అలంకరించారు. రథోత్సవం, సిడే ఊరేగింపులో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు. కర్ణాటక మాజీ మంత్రి అరవింద్ లింబావళి, ఫైనాన్స్ కమిటీ సభ్యుడు రమేష్ మహరాజ్, తాండూరు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి వేడుకల్లో పాల్గొని అమ్మవారికి పూజలు చేశారు. జాతరలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా ఎస్ఐ విఠల్‌రెడ్డి, ఏఎస్ఐలు రాజశేఖర్, పవన్‌కుమార్ బందోబస్తు ఏర్పాటు చేశారు. వేడుకల్లో ఆలయ ఈవో శేఖర్ గౌడ్, మాజీ చైర్మన్ సందీప్‌రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ బాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బ్రిడ్జి నిర్మాణంలో నాణ్యత పాటించాలి

మొయినాబాద్ రూరల్: ఈసీ వాగుపై నిర్మిస్తున్న బ్రిడ్జి నిర్మాణ పనులు నాణ్యతతో ఉండాలని జిల్లా పంచాయతీరాజ్ ఎస్‌సీ శ్రీనివాస్‌రెడ్డి, ఈఈ శ్రీరాములు, సీఈ జోగిరెడ్డి అన్నారు. నక్కలపల్లి–హైతాబాద్ మధ్యలో ఈసీ వాగుపై కొనసాగుతున్న వంతెన పనులను శుక్రవారం వారు మండల డిప్యూటీ డీఈ విజయ్‌కుమార్‌తో కలిసి పర్యవేక్షించారు. ఈసీవాగుపై బ్రిడ్జి నిర్మాణం కోసం గత ప్రభుత్వం సీఆర్ఆర్ కింద రూ.5 కోట్లు మంజూరు చేసినట్లు విజయ్‌కుమార్ అధికారులకు తెలిపారు. పనులు జరుగుతున్న తీరును వారికి వివరించారు. అధికారులు మాట్లాడుతూ.. వంతెన నిర్మాణంలో ఎలాంటి జాప్యం లేకుండా నాణ్యతతో నిర్మించేలా చూడాలని సూచించారు.

ప్రజలను చైతన్య పరచాలి

డీఈఓ రేణుకాదేవి



కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న డీఈఓ రేణుకాదేవి

అనంతగిరి: మానవ అక్రమ రవాణాను అరికట్టడానికి ఉపాధ్యాయులు తమ వంతుగా ప్రజలను చైతన్య పరచాలని డీఈఓ రేణుకాదేవి సూచించారు. శుక్రవారం వికారాబాద్‌లోని డైట్ కళాశాలలో కస్తూర్బా గాంధీ, ఆదర్శ పాఠశాలలు, అర్బన్ రెసిడెన్షియల్ పాఠశాలల నుంచి ఇద్దరు ఉపాధ్యాయులకు మానవ అక్రమ రవాణాను అరికట్టడంపై రెండు రోజుల శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. సామాజిక బాధ్యతగా ఉపాధ్యాయులు మానవ అక్రమ రవాణా అరికట్టడంలో తమ వంతు పాత్ర వహించాలన్నారు. మానవ అక్రమ రవాణా సమాచారం తెలిస్తే టోల్ ఫ్రీ నెంబర్ 1098, 100, 181, 1930కు కాల్ చేసి ఫిర్యాదు చేయాలన్నారు. కార్యక్రమంలో స్వచ్ఛంద సంస్థ రిసోర్స్ పర్సన్ శ్రీకాంత్, సుప్రియ శ్రీదేవి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విద్యా ప్రమాణాలు మెరుగు పర్చుకోవాలి

పూడూరు: ఉపాధ్యాయులు విద్యా ప్రమాణాలను మెరుగు పర్చుకుని బోధన చేయాలని డీఈఓ రేణుకాదేవి సూచించారు. శుక్రవారం మండలంలోని మోడల్ స్కూల్‌లో ఉపాధ్యాయుల శిక్షణ కార్యక్రమాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మారుతున్న కాలానికి అనుగుణంగా విద్యార్థులకు అర్థమయ్యేలా బోధన చేయాలన్నారు. కార్యక్రమంలో గెస్ట్ లెక్చరర్ వీరయ్య, కోర్సు డైరెక్టర్ సాయిరెడ్డి, మానిటరింగ్ అధికారి రామ్ మస్తాన్, సెక్టోరియల్ అధికారి రమేష్, డీఆర్పీలు రవికుమార్, బాల్‌రాజ్ పాల్గొన్నారు.

అభివృద్ధిలో అగ్రగామి

- రూ.10 వేల కోట్లతో పనులు
- శరవేగంగా నిర్మాణాలు
- సీఎం రేవంత్‌రెడ్డి ప్రత్యేక దృష్టి

కొడంగల్: నియోజకవర్గంలో అభివృద్ధి పనులు శరవేగంగా జరుగుతున్నాయి. సీఎం రేవంత్‌రెడ్డి ప్రత్యేక చొరవతో అభివృద్ధిలో అగ్రగామిగా నిలుస్తోంది. గడిచిన ఏడాదిన్నర కాలంలో సుమారు రూ.10 వేల కోట్లతో నియోజకవర్గం దశ దిశ మార్చేలా పనులు సాగుతున్నాయి. విద్య, వైద్యం, ఉపాధి రంగాలకు మొదటి ప్రాధాన్యత కల్పించారు. ప్రభుత్వ మెడికల్ కళాశాల, వృత్తి విద్యా కళాశాల, ఇంజనీరింగ్, నర్సింగ్ కళాశాలలు, వ్యవసాయ పరిశోధనా కేంద్రం, మహిళా డిగ్రీ కళాశాల, పీజీ, జూనియర్ కళాశాలలు మంజూరు చేశారు. కొడంగల్ పట్టణంలో 220 పడకల ప్రభుత్వ టీచింగ్ ఆస్పత్రి పనులు చకచకా సాగుతున్నాయి. రూ.6 కోట్లతో ఆర్‌అండ్‌బీ అతిథి గృహం నిర్మిస్తున్నారు. రోడ్ల విస్తరణ పనులు ఊపందుకున్నాయి. అభివృద్ధి పనుల్లో వేగం పెంచినట్లు కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఎనుముల తిరుపతిరెడ్డి తెలిపారు.



కొడంగల్‌లో చురుగ్గా సాగుతున్న ప్రభుత్వ టీచింగ్ ఆస్పత్రి భవన నిర్మాణం



హస్నాబాద్‌లో నిర్మిస్తున్న పాఠశాల భవనం



బొంరాస్‌పేట మండలంలో పూర్తయిన బీటీ రోడ్డు



కొడంగల్‌లో నిర్మిస్తున్న ఆర్‌అండ్‌బీ అతిథి గృహం